క్లుప్తంగా

మునగాల మేఘనకు డాక్టరేట్



డాక్టర్ మునగాల మేఘన

నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన మునగాల మేఘన ఐఐటీ బాంబే నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నట్లు నెల్లూరులో శనివారం ఆమె తెలిపారు. పీహెచ్‌డీ కోసం జపాన్‌లో ఇండో జపాన్ కొలాబరేషన్‌లో ప్రతిష్టాత్మక జేఐసీఏ స్కాలర్‌షిప్‌కి ఎంపిక కావడంతోపాటు ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశం పొందారు. ఐఐటీ బాంబే కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో 'సస్టెయినబుల్ వాలరైజేషన్ ఆఫ్ సుగారో ఇండస్ట్రీ వేస్ట్ త్రూ సర్క్యులర్ ఎకానమి అప్రోచెస్' అనే అంశంపై ఐఐటీ బాంబేకి ఆమె పరిశోధన వ్యాసం సమర్పించి పీహెచ్‌డీ అందుకున్నారు. ఆమె శాస్త్ర యూనివర్సిటీ తిరుచ్చిలో ఇంజినీరింగ్, హైదరాబాద్ ఐఐటీ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. మేఘన తండ్రి రంగారావు కొత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు, తల్లి విజయనిర్మల నెల్లూరులోని కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా వివిధ ఏర్పాట్లను నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అవసరమైన రక్షణ చర్యలు, బారికేడ్లు, పోలీసుల చెకింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతరులు సంచరించకూడని నిషేధిత ప్రాంతాల మార్కింగ్ తదితర ఏర్పాట్లను డీఎస్పీ శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నందివాహనంపై శివపార్వతుల విహారం



మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలులోని సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులైన సంగమేశ్వరుడు, కామాక్షితాయి(శివపార్వతులు) శుక్రవారం అర్ధరాత్రి నంది వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. అర్చకుడు సాయిశర్మ శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉత్సవర్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి నంది వాహనంపై కొలువుదీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు, పండ్లు, పూలు నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు పట్టారు. శనివారం మధ్యాహ్నం వరకు గ్రామోత్సవం కొనసాగింది. చిట్టమూరు సురేందర్‌రెడ్డి, సునంద దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన డీజే, మంగళ వాయిద్యాలు, తప్పెట్లు భక్తులను అలరించాయి.

వలంటీర్ల రాజీనామా

• జగనన్న విజయానికి కృషి చేస్తామని స్పష్టం



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

కొడవలూరు : మండలంలోని మిక్కిలింపేటకు చెందిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి బి.మధుసూదన్ రావుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే సేవలందించాలని జగనన్న తమకు వలంటీర్ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఇంటి వద్దకే పింఛన్లు అందించడంతో పాటు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలందిస్తూ వచ్చామన్నారు. సేవే ప్రధానంగా పనిచేస్తున్న తమపై చంద్రబాబు రాజకీయ కక్షకట్టి సేవలను నిలిపి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన జగనన్నను ఈ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

• ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/కమిషనర్ వికాస్ మర్మత్ సిబ్బందికి సూచించారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులకు స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో రెండో విడత శనివారం ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు రెండు రోజులపాటు పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో సందేహాలకు తావులేకుండా సిబ్బందికి వివరించాలని మాస్టర్ ట్రైనర్స్‌కు సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో మెటీరియల్‌ను పరిశీలించుకోవడం, మెటీరియల్ తీసుకున్నాక పోలింగ్ కేంద్రాలకు తరలించడం, మాక్ పోల్ విధానం, ఈవీఎంల సీలింగ్ విధానం, ప్రతికూల పరిస్థితుల్లో ఈవీఎంల రీప్లేస్‌మెంట్, వీవీప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో డిస్‌ప్లే బోర్డులు, హౌస్ ఆఫ్ పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల అధికారులకు నమూనా పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్ఓ ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ వస్తే కరువు తాండవిస్తుంది



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరువుతాండవించి ప్రజల కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని సజ్జాపురంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసే ఆదాల ప్రభాకర్‌రెడ్డి కావాలో.. వివాదాలు, అరాచకాలు సృష్టించి పచ్చని గ్రామాల్లో చిచ్చుపెట్టే శ్రీధర్‌రెడ్డి కావాలో.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోవడం ఖాయమన్నారు. పేద ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల కోసం ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకు చేరుస్తున్న వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు రద్దు చేస్తారన్నారు. కనుక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన మళ్లీ రావాలంటే ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేస్తున్న తనను, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సజ్జాపురం గ్రామ సర్పంచ్ అప్పకూటి నారాయణ, వైస్ సర్పంచ్ సూరేపల్లి కొండయ్య, ఏఎంసీ డైరెక్టర్ తాటిపర్తి వెంకటేష్, సీనియర్ నాయకులు నెల్లూరు సీతయ్య, చీకుర్తి గోపాల్, గుంజి రాఘవులు, పాశం దయాకర్, యరగల సుధార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించండి



21వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మొయిళ్ల గౌరి తదితరులు

నెల్లూరు(బారకాసు): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి కోరారు. నగరంలోని 21వ డివిజన్‌లో శనివారం ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు సుబ్బారావు, రాజారెడ్డి, సాయి, శేఖర్, సుధాకర్‌రెడ్డి, వెంకయ్య, బుజ్జన్న, రమణయ్య, మల్యాద్రి, రియాజ్, రాజేశ్వరి, అక్బర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జెనెక్స్‌లో ఐటీ జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన వారితో జెనెక్స్ విజన్ చైర్మన్ వెంగళరెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): ఐటీ ఉద్యోగాల కోసం తమ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైందని జెనెక్స్ విజన్ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ ఎస్.వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు తెలిపారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారిని శనివారం స్థానిక హరనాథపురంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలలో గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ నేతృత్వంలో జరిగిన జాబ్‌మేళాలో టెక్ మహీంద్ర, అసెంచర్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 270 మంది పాల్గొనగా.. వారిలో 82 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. గత నెలలో కూడా తమ కళాశాలలో టీసీఎస్, అసెంచర్, హెక్సావేర్ తదితర కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాలో 116 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చరణ్‌తేజ, మహీంద్ర హెచ్‌ఆర్ జగదీశ్, జెనెక్స్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుషుల సేవనం.. రాక్షస సంహారం



ఉపన్యాసకులు శ్రీరామకృష్ణప్రసాద్‌రావును సత్కరిస్తున్న సభాపోషకులు

నెల్లూరు(బృందావనం): అరణ్యవాసంలో రామలక్ష్మణులు ఆశ్రమాలను సందర్శిస్తూ రుషులను గురుభక్తితో సేవించడంతోపాటు రాక్షసులను సంహరించి లోకరక్షణకు ఎంతో కృషి చేశారని ప్రముఖ వైద్యుడు, ఉపన్యాసకులు డాక్టర్ సింగరాజు శ్రీరామకృష్ణప్రసాద్‌రావు తెలిపారు. పద్య సారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధి పీటీజీ టవర్స్‌లో జరుగుతున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి అరణ్యకాండంపై ఆయన ఉపన్యసించారు. అరణ్యకాండంలో అగస్త్యాశ్రమ సందర్శన, జటాయువు దర్శనం, పంచవటిలో సీతారాముల వనవాసం, శూర్పణఖ పరాభవం, సీతాపహరణం తదితర ఘట్టాలను వివరించారు. సభాపోషకులుగా కె.గోవిందాచార్యులు, రమాదేవి దంపతులు వ్యవహరించారు. ఉపన్యాసకులు శ్రీరామకృష్ణప్రసాద్‌రావును సత్కరించారు. కార్యక్రమంలో పద్య సారస్వత్ పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖరం, శతావధాని కొండపి మురళీకృష్ణ, కోట శ్రీరామమూర్తి, అవధాని కోట రాజశేఖరం, శివరాం, స్వామి సమయానంద, చక్కిరాల జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై దాడి హేయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పచ్చగూండాలు రాళ్ల దాడి చేయడం హేయమని వైఎస్ఆర్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.డి.ఖలీల్ అహ్మద్, 15వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి పచ్చ పార్టీ నేతలు తట్టుకోలేక ఇలాంటి పిరికిపంద చర్యలకు దిగారని పేర్కొన్నారు. కార్యకర్తలు, ప్రజలు ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎన్నికల్లో పచ్చపార్టీ మూకకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

'నవోదయ'కు రామాపురం విద్యార్థిని



రజ్వీక

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని కె.రజ్వీక నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరికకు ఇటీవల జిల్లాస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందులో రజ్వీక ప్రతిభ కనబరిచి అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గౌస్‌బాషా, ఉపాధ్యాయినులు సి.మాధవి, పీఆర్.సుహాసినీ శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

అదుపుతప్పిన గ్యాస్ సిలిండర్ల లారీ



హైవేపై పడిపోయిన సిలిండర్‌లు

మనుబోలు : గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ శనివారం మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి పడిపోవడంతో సిలిండర్‌లు హైవేపై పడిపోయాయి. నెల్లూరు వైపు నుంచి సిలిండర్లతో గూడూరు వైపు వెళ్తున్న లారీ మండల పరిధిలోని హైవేపై పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఉంచిన బారికేడ్లను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి పడిపోయింది. దీంతో లారీలో ఉన్న భారీ గ్యాస్ సిలిండర్‌లు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సిలిండర్‌లు ఎక్కడ లీకవుతాయోనని వాహనదారులు ఆందోళన చెందారు. అయితే ఎక్కడా లీకులు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



మనుబోలు : విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మనుబోలు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను శనివారం కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 66 మందికి గాను 56 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కాగితాలపూరు గ్రామానికి చెందిన ఎంపీసీ విద్యార్థిని బోలా శ్రావ్య వెయ్యి మార్కులకు 977 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించారని తెలిపారు. బైపీసీలో ఆర్.నీలిమ 893 మార్కులతో రెండో స్థానంలో, సీఈసీలో సుమలత 784 మార్కులతో మూడో స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 55 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు. వీరిలో ఎంపీసీ విద్యార్థిని ప్రవళిక 470 మార్కులకు 394, జాహ్నవి 440 మార్కులకు 365 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో శరత్‌బాబు, మల్లికార్జున, రమేష్, శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సునంద

• వేణుంబాక సునంద

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రజలకు పారదర్శకంగా అందాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనే వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు దోహదం చేస్తుందని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సతీమణి సునంద తెలిపారు. నగరంలోని 40వ డివిజన్‌లో శనివారం ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీని మరోసారి ప్రజలు అధికారంలోకి తీసుకురావాలని కోరారు. విజయసాయిరెడ్డి స్వస్థలం అయిన నెల్లూరు జిల్లాకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నెల్లూరు అభివృద్ధికి విజయసాయిరెడ్డి ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో 40వ డివిజన్ ఇన్‌చార్జి మానికల సునీల్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్తం జ్యోతి, హిమబిందు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలను భారీ మెజారిటీతో గెలిపిద్దాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు



ఆదాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

• ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని, ఎప్పుడూ ప్రజా సేవలో ఉండే ఆయనను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఆదాల కుమార్తె హిమబిందు కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్‌లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, అయిరెడ్డి సుబ్బారెడ్డి, బోయిల్ల అద్దిరెడ్డి, టీవీఎస్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాల గెలుపునకు సహకరిస్తాం

నెల్లూరు రూరల్ మండలం మాదరాజు గూడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.గోపాల్‌రెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆదాల విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్‌యాదవ్, నాయకులు శివ సునీల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న ద్వారకానాథ్ దంపతులు తదితరులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని నవాబుపేటలో శ్రీఆర్యవైశ్య మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మించనున్నట్లు నుడా చైర్మన్, ఆ దేవస్థానం పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. నవాబుపేటలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణం సందర్భంగా శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘీయుల సహకారంతో, దాతల సౌజన్యంతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అమ్మవారి గర్భాలయాన్ని కృష్ణశిలతో పూర్తిగా రాతి కట్టుబడి చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చుండూరు సుదర్శన్, ఉపాధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి రాజగోపాల్, కార్యదర్శి పైడా హేమంత్‌కుమార్, సహాయ కార్యదర్శులు కర్నాటి నిరంజన్‌కుమార్, రవ్వ వెంకటరమేష్‌బాబు, జలుదు బాలసుబ్రహ్మణ్యం, పత్తి గిరిధర్, ట్రస్ట్ సభ్యులు, వంశ పారంపర్య సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో కేఏసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



డీవీ శ్రావిక,



పల్లవి,



పర్హాన

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రతిభను చూపిన విద్యార్థులను శనివారం ఆ కళాశాలలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్‌లో 218 మంది విద్యార్థులకు గాను 122 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 1000 మార్కులకు గాను హెచ్‌ఈసీ విభాగంలో డీవీ శ్రావిక 964 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. సీఈసీలో నాగలక్ష్మి 929, ఎంపీసీ గ్రూపులో కుమారస్వామి 926 మార్కులు సాధించారని తెలిపారు. వొకేషనల్ విభాగంలో సీనియర్ సీఎస్‌ఈలో పల్లవి 953, ఈఈటీలో సంతోష్ 948, ఎంఎల్‌టీలో పి.ప్రవల్లిక 925 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ హెచ్‌ఈసీలో వెంకటసాయి యాషిక 465, ఎంపీసీలో ఫర్హాన 455, బైపీసీలో లలిత 402, ఒకేషనల్ సీఎస్‌ఈలో అక్బర్ 489, ఓఏకి చెందిన గ్రూపులో సాహితి 465 మార్కులు, సిటికి చెందిన వాసిఫా ఆయేషా 429 మార్కులు సాధించారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో ఖర్చు లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను కేఏసీ కళాశాలలో చేర్పించాలని కోరారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గిరిజనులకు అవగాహన కల్పించిన స్వీప్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఓటుహక్కు వినియోగించుకోవడం పౌరుల సామాజిక బాధ్యత అని కోవూరు నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి వెంకటరత్నం అన్నారు. మండలంలోని పంచేడు వెస్ట్ గిరిజన కాలనీలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈసీ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్రమంలో స్వీప్ సభ్యులు రవిశంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.